క్లుప్తంగా

చదలాడలో ఉపవాస ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనల్లో మాట్లాడుతున్న పాస్టర్

పెద్దాపురం: మండలంలోని చదలాడ క్రీస్తుశాంతి ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో గురువారం ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఆధ్యాత్మికతను అలవర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్యక్రమంలో పాల్గొన్న దైవజనులు నంగిన సత్యానందం, అభిషేక్, జయకుమార్ అన్నారు. సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మందిర నిర్వాహకుడు సుదీప్, పాస్టర్లు పాల్గొన్నారు.

అద్దకం పనులకు మంచి డిమాండ్

డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి



చీరలపై పెయింటింగ్ పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీరమణి

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో చీరలపై అద్దకం పనులను డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి పరిశీలించారు. టీటీడీసీలో గ్రామీణ మహిళలకు కుట్టు శిక్షణతో పాటు చీరలపై డిజైన్లు, అద్దకంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణను ఆమె గురువారం పరిశీలించారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని పీడీ పిలుపు నిచ్చారు. జాకెట్లు, చీరలపై డిజైన్ పనులకు మంచి డిమాండ్ ఉన్నదని ఆమె చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మెహర్ తెలిపారు. కామర్స్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కళాశాల పనివేళ్లలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్టు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం స్థానిక ఎస్సై పవన్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.76,500, రెండు సెట్ల ప్లే కార్డులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

కరప: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం మేరకు పెదపూడి మండలం శహపురం గ్రామానికి చెందిన బుద్దాల నూకరత్నం గురువారం మధ్యాహ్నం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న తమ బంధువులను చూసేందుకు కరపలో బస్సు కోసం నిలబడింది. అదే సమయంలో రామచంద్రపురం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొట్టగా రోడ్డుపై పడిపోయింది. ఆర్టీసీ బస్సు ముందర చక్రాలు నూకరత్నం రెండు కాళ్లపై నుంచి పోవడంతో తీవ్రగాయాలయ్యాయి. కుడిచేతికి కూడా గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆమె బంధువులు హుటాహుటిన వచ్చి, చికిత్సకోసం 108లో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిత్య వ్యాయామంతో నిండైన ఆరోగ్యం

కాకినాడ క్రైం: నిండైన ఆరోగ్యానికి నిత్య వ్యాయామం తప్పనిసరి అని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, ఆర్థోపెడిక్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అన్నారు. గురువారం జాతీయ ఎముకల వ్యాధుల నివారణ వారోత్సవాలు జీజీహెచ్‌లో ప్రారంభమయ్యాయి. సూపరింటెండెంట్, హెచ్‌ఓడీలు ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ ద్వారా వారోత్సవాలను ప్రారంభించారు. ర్యాలీలో వైద్య విద్యార్థులు వ్యాయామం ఆవశ్యకతపై నినాదాలిచ్చారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ యాంత్రీకరణ, సాంకేతికత వల్ల మానవ జీవనం వ్యాయామానికి దూరమైందని అన్నారు. మారుతున్న జీవన శైలి ఎముకలకు సంబంధించిన అనేక అనారోగ్యాలకు కారణమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌ఆర్‌ఎంఓ డాక్టర్ అనిత, ఫిజియోథెరపీ హెచ్‌ఓడీ డాక్టర్ సాయినాథ్, ఆర్థోపెడిక్ వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలంలో నీట మునిగిన పత్తి చేలు



గొల్లప్రోలు మండలంలో చెందుర్తిలో నీట మునిగిన వరి నాట్లు



గొల్లప్రోలు కొత్త కాలనీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న సుద్దగెడ్డ

అంతా ముంపుమయం

- గొల్లప్రోలులో పెరిగిన వరద ఉధృతి
- పొంగి పొర్లుతున్న సుద్దగెడ్డ
- 500 హెక్టార్లలో వరి, 100 హెక్టార్లలో పత్తి నీట మునక

పిఠాపురం: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఏలేరు జలాశయం నుంచి అదనపు జలాలను దిగువకు విడదల చేయడంతో నియోజకవర్గంలో రెండో రోజు గురువారం వరద ఉధృతి మరింత పెరిగింది. గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు మండలంలో పలు గ్రామాలు నీట మునిగాయి. గత రెండు వారాలుగా వేసిన వరి నాట్లు, ప్రత్తి, మిరప, ఇతర వాణిజ్య పంటలు ముంపు బారిన పడ్డాయి. సుద్దగెడ్డ పొంగి పొర్లుతుండడంతో గొల్లప్రోలు సూరంపేట వద్ద రహదారులు నీట మునిగి రాక పోకలు పూర్తిగా నిలిచి పోయాయి. మండలంలో ఇప్పటివరకూ సుమారు 500 హెక్టార్లలో వరి, 100 హెక్టార్లలో పత్తి, మిరప ఇతర వాణిజ్య పంటలు ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే రెండు రోజుల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగెడ్డ ఉధృతికి లోతట్టు కాలనీలు నీట మునిగి వీధులు చెరువులుగా మారిపోయాయి. గొల్లప్రోలు సమీపంలోని కొత్త కాలనీ వద్ద రహదారి పూర్తిగా జలమయమవ్వడంతో టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. నీట మునిగిన కాలనీల్లో విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు చీకటిలో మగ్గుతున్నారు.



గొల్లప్రోలు మండలంలో వన్నెపూడిలో చెరువును తలపిస్తున్న వరిచేలు

మహనీయుల ఆశయ సాధనలో నడవాలి



విగ్రహావిష్కరణ శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న దొరబాబు

పెద్దాపురం: యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనలో నడుచుకోవాని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఆర్బీ కొత్తూరులో శుక్రవారం ఆ మహనీయుల విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. ఉప సర్పంచ్ గోలి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌ల అడుగుజాడల్లో యువత నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఊబా జాన్‌మోజెస్, యుంద్రు సత్తిబాబు, గోలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి రాట్నం బహూకరణ



కొత్తపల్లి: చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలో జరిగిన ఎగ్జిబిషన్‌లో కొత్తపల్లికి చెందిన చేనేత కార్మికుడు పొన్నగంటి వీరవెంకట సత్యనారాయణ ఉప్పాడ చేనేత సొసైటీ తరపున స్టాల్ ఏర్పాటు చేశాడు. ఉప్పాడ చీరలను ప్రదర్శించడంతో ఉప రాష్ట్రపతి సతీమణి సత్యనారాయణకు రాట్నం చిహ్నాన్ని బహుమతిగా అందించారు.

ఉప రాష్ట్రపతి సతీమణి చేతుల మీదుగా రాట్నం అందుకుంటున్న సత్యనారాయణ

పంట కాలువల్లో పూడిక తొలగింపు



గొర్స పంట కాలువలో పూడిక తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఏఓ జోగిరాజు

కొత్తపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయి. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంట కాలువలు పూడుకుపోయి అధ్వానంగా మారడంతో వరదనీరు పొలాలను ముంచెత్తింది. దీనిపై బుధవారం ‘పూడిక సమస్యకు పరిష్కారమేదీ ?’ అనే శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంట కాలువల్లో పూడిక, గుర్రపు డెక్కను గురువారం జేసీబీలతో తొలగించారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

కాకినాడ ఆర్డీఓ కిషోర్



గొల్లప్రోలులో సుద్దగెడ్డ ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాకినాడ ఆర్డీఓ కిషోర్

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలోని వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ తెలిపారు. గొల్లప్రోలు మండలంలో సుద్దగెడ్డ ముంపు ప్రాంతాన్ని నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలోని సుద్దగెడ్డ పరివాహక ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సుద్దగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహించి గొల్లప్రోలులో పలు ప్రాంతాలు నీట మునిగాయన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రక్షణ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాలనీవాసులకు అవసరమైన తాగునీరు తక్షణమే అందించాలని, కాలనీ అంధకారంలో ఉన్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కాలనీ సమీపంలోని మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది పరిస్థితిని పరిశీలించాలన్నారు. కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు అవసరమైన పడవలను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ సిబ్బందిని ఆదేశించారు. బాధితులకు రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఇన్చార్జి తహసీల్దార్ మస్తానా విద్యుత్ శాఖ అధికారులు, మత్స్యశాఖ అధికారులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పైప్‌లైన్ మరమ్మతులు



డ్రైన్‌లో పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

- ఎడతెరిపిలేని వర్షాలతో పనుల్లో జాప్యం
- స్వయంగా పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సామర్లకోట: స్థానిక జయలక్ష్మి థియేటర్ సమీపంలో మరమ్మతులు చేస్తున్న తాగునీటి పైపులైన్ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు పరిశీలించారు. అప్పయ్య చెరువు నుంచి వెళ్తున్న ప్రధాన డ్రైనులో జేసీబీతో పూడికతీత సమయంలో పైపులైన్ ధ్వంసమైన విషయం తెలిసిందే. దాంతో పది రోజులుగా సత్యనారాయణపురం ప్రాంతానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు ఆ ప్రాంత ప్రజల ఆందోళన మేరకు మున్సిపల్ కమిషనర్ దగ్గరుండి పనులు ప్రారంభించారు. ప్రతి రోజు వర్షం కురుస్తుండంతో డ్రైన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో పనులకు అంతరాయం ఏర్పడుతోందని ఇంజనీరింగ్ అధికారి సాగర్ తెలిపారు. డ్రైన్‌లో నీరు పూర్తిగా తొలగించి పైపులైన్ మరమ్మతు పనులు చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నుంచి తాగునీరు అందజేస్తామని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ సేపెని సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి, ఆ ప్రాంత ప్రజలు పడాల పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా నెలలోని రెండో శుక్రవారం మినహా మిగిలిన శుక్రవారాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించాలని దేవదాయ అధికారులు నిర్ణయించినట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఈ నెల 9, 23, 30 తేదీల్లో నిర్వహించే వ్రతాలకు సామగ్రి ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చారని, ఆ రోజుల్లో వచ్చే మహిళలు కేజీన్నర బియ్యం, కలశపాత్ర, జాకెట్టు ముక్క మాత్రమే తీసుకురావలసి ఉంటుందన్నారు. వ్రతాలకు ఉదయం 9 గంటలకే మహిళలు హాజరుకావాలని ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసీ ఎన్నికలు



వీకే రాయపురం హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో ఎంఈఓ-2 పుల్లయ్య



కోనపాపపేటలో ఎస్‌ఎంసీ సభ్యులను అభినందిస్తున్న ఎంఈఓ వేణుగోపాల్

సామర్లకోట: మండల పరిధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 75 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా మున్సిపాలిటీ పరిధిలో కొదండరామపురం, నవర, ఉప్పరగూడెం ఎలిమెంటరీ పాఠశాలల్లో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మిగిలిన 72 పాఠశాలలో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు పోటీ జరిగింది. అచ్చంపేటలో వైస్‌చైర్మన్ ఎన్నికలో కొద్దిపాటి ఉద్రిక్తత ఏర్పడింది. అయితే ఎంఈఓలు జోక్యం చేసుకోవడంతో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. వీకే రాయపురం జెడ్పీ హైస్కూల్‌లో చైర్మన్‌గా గొల్లపల్లి పశువులరావు, వైస్ చైర్మన్‌గా మోర్త సుజాత ఎన్నిక అయ్యారు. అలాగే స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో చైర్మన్‌గా అక్కిన చక్రధర్, వైస్ చైర్మన్‌గా ఇంజరపు సునీత ఎన్నిక అయ్యారు. జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా పుట్టా భవాని, వైస్ చైర్మన్‌గా పచ్చాకుల లోవరాజు ఎన్నిక య్యారు. జి.మేడపాడు జెడ్పీ హైస్కూల్ చైర్మన్‌గా మేడిశెట్టి పురుషోత్తమ్, వైస్‌చైర్మన్‌గా ఇంత కుమారిలు హెచ్‌ఎం పాండవులు ఆధ్వర్యంలో ఎన్నికయ్యారు. బీబీఆర్ హైస్కూల్‌లో కోటాన జ్యోతి చైర్మన్‌గాను, వైస్ చైర్మన్‌గా పట్నాల వరలక్ష్మి ఎన్నికయ్యారు. యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం యు సత్యనారాయణ ఆధ్వర్యంలో చైర్మన్‌గా సోమేశ్వరపు కన్నబాబు, వైస్ చైర్మన్‌గా కాపవరపు సుధారాణి ఎన్నిక అయ్యారు.

బడుల అభివృద్ధికి కృషి చేయాలి

కొత్తపల్లి: నూతనంగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ)లు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని 67 ప్రభుత్వ పాఠశాలలకు గాను 66 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికలకు తల్లిదండ్రులు రాకపోవడంతో ఎన్నికలు వాయిదా వేశారు. పలు పాఠశాలల్లో నూతనంగా ఎన్నికైన ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ ఇండస్ట్రియల్ ఏరియా, తహసీల్దార్ కార్యాలయం, అమ్మాణమ్మ అపార్టుమెంట్ ఏరియా, సుగర్ ఫ్యాక్టరీ క్లబ్, బీబీఆర్ హైస్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించాలని సూచించారు.

ఈ-క్రాప్‌తో ఎంతో ప్రయోజనం

- ప్రభుత్వ పథకాలకు.. పంట నష్టాలకు ఆధారం
- అన్నదాతకు అవగాహన అవసరం



సామర్లకోట మండలం కొప్పవరంలో ఈ-క్రాప్ చేస్తున్న వ్యవసాయాధికారులు



వీకే రాయపురంలో రెండో పర్యాయం నీట మునిగిన వరినాట్లు

సామర్లకోట: ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. దీని వల్ల అధికారులు, ప్రభుత్వానికి వివరాల సేకరణ సులభమవుతుంది. వరితో పాటు అన్ని రకాల పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేస్తారు. సామర్లకోట మండల పరిధిలో 9,200 హెక్టార్లలో, పెద్దాపురం మండల పరిధిలో నాలుగు వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో 12వేల హెక్టార్లలో ఖరీఫ్ వరిసాగు చేస్తున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో 1,200 ఎకరాలల్లో పామోలిన్, 500 ఎకరాల్లో చెరకు, వంద ఎకరాలల్లో కొబ్బరి, 350 ఎకరాల్లో కూరగాయలు, 200 ఎకరాల్లో బొప్పాయి తదితర పంటలు పండిస్తున్నట్లు అధికారులు తెలియజేస్తున్నారు. ప్రకృతి వల్ల అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోతూ ఉంటారు. వారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్బీకేను ఏర్పాటు చేసి ఈ-క్రాప్ నమోదుపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి పంట భూమిని వ్యవసాయాధికారులు ఈ- క్రాప్‌లో నమోదు చేస్తారు. దీని వల్ల రైతులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ రుణాలు, పంట నష్టం, సబ్సిడీపై యంత్ర పరికరాలు, ధాన్యం కొనుగోలు వంటి ప్రయోజనాలు రైతులు సులభంగా అందుకోవడానికి వీలవుతుంది. అధిక వర్షాలు, వరదలు సంభవించిన సమయంలో వరితో పాటు ఇతర పంటలకు నష్టం జరిగే అవకాశం ఉంది. దాంతో అధికారులు ఈ-క్రాప్‌లో నమోదు ఆధారంగా పంట నష్టం అంచనా వేసి సహాయం చేస్తుంటారు. వ్యవసాయశాఖ, వీఆర్వోలు ఉమ్మడిగా ఈ-క్రాప్ నమోదు చేయడం జరుగుతుంది. ఆ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల ఏఏ సమయాల్లో రైతులకు ఏఏ ఎరువులు కావలసి ఉంటుందో అధికారులు గుర్తించడానికి వీలు కలుగుతుంది. రైతులు స్వయంగా వారి సెల్ నుంచి పంట నమోదు చేయవచ్చు. ఈకేవైసీ తరువాత సాగుదారునికి డిజిటల్ సమాచారం అందుతుంది.

నీటిలో వరి పంట భూములు



వీకే రాయపురంలో వరి పంట నీట మునిగింది. ఈ-క్రాప్ నమోదు ప్రారంభం కాలేదు. గ్రామానికి చెందిన వీఏఏ సెలవు పెట్టారు. గతంలో కురిసిన వర్షాలకు పంట నీటిలోనే కుళ్లిపోవడంతో, రెండోసారి వరి నాట్లు వేశాము. మూడెకరాలకు రూ.35 వేలు ఖర్చు అయింది. మునిగిపోయిన వరినాట్లకు నష్ట పరిహారాన్ని అధికారులు పట్టించుకోవడంలేదు. రెండోసారి వేసిన నాట్లదీ అదే పరిస్థితి. అధికారులు ఆదుకోవాలి.

– ఇంటి వెంకట్రావు, రైతు సంఘ నాయకుడు, వీకే రాయపురం, సామర్లకోట మండలం

ఈ-క్రాప్ నమోదు ప్రారంభం



ఈ నెల ఐదో తేదీ నుంచి మండలంలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభమైంది. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 80 శాతం వెదజల్లు పద్ధతిలోనే వరిసాగు పూర్తి చేశారు. మండలంలో 9,200 హెక్టార్లలో వరి సాగవుతుండగా, ఆరు వేల హెక్టార్లలో స్వర్ణ, ఎంటీయూ 1318 రకం 2,800 హెక్టార్లలోను, బీపీటీ 5204 రకం 300 హెక్టార్లలోను, ఇతర రకాలు మిగిలిన భూమిలో పండిస్తున్నారు. సెప్టెంబరు 15 నాటికి ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయవలసి ఉంది. ఈ క్రాప్ నమోదైన వారికి ప్రభుత్వ పథకాలు అందుతాయి.

– ఐ.సత్య, ఎంఈఓ

ట్రాఫిక్ సమస్యకు మోక్షం ఎప్పుడో ?



సామర్లకోట ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్‌పై నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. వంతెనపై అడుగడుగునా గోతులతో నిండిపోయింది. పలు గోతుల్లో పడిన వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడం సాధారణమైపోయింది. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా అధికారులు స్పందించకపోవడం శోచనీయమని వాహన చోదకులు అంటున్నారు. కార్పొరేట్ కళాశాలలకు చెందిన బస్సుల రాక పోకల సమయంలో ఈ సమస్య ఎక్కువగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కొత్తపల్లి: సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసినట్లు స్థానిక పోలీసులు గురువారం తెలిపారు. మండలంలోని కొమరగిరి శివారు శెట్టిబలిజపేటకు చెందిన రాయుడు నాగమణి సారా విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో దాడిచేశారు. సారా విక్రయిస్తున్న నాగమణిని అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 5 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని పిఠాపురం కోర్టులో హాజరు పరచగా రిమాండు విధించినట్లు తెలిపారు.